ఆంధ్రజ్యోతి వారపత్రిక - జూన్ 18, 1982

"ఆఫీసుకు టైముకి వెళ్ళడం కష్టమేమీ కాదు. మనసొప్పాలి. అంతే - "

# వళ్ళు బరువు

ఫలానా అని చెప్పలేనుగానీ, ఈ మధ్య వంట్లో నాకదోలాగుంటోంది. నాలుగు రోజులు చూసి డాక్టర్ దగ్గరకు వెళ్ళాను. డాక్టరు నన్ను రకరకాలుగా పరీక్షచేసి "మీలో పెద్దగా లోపాలేమీ లేవు. ఎటొచ్చీ బరువు కాస్త తగ్గాలి" అన్నాడు.

"ఏం చేయమంటారు?" అనడిగాను.

"ఆహారం మితంగా తీసుకోండి. కాస్త శరీర వ్యాయామం చేయండి. వీలైనంత వరకూ ఎక్కడికైనా నడిచే వెడుతూండండి" అన్నాడు డాక్టరు.

నేను అతిగా తింటానని అనుకోను. ప్రస్తుతం తినేదానిని తగ్గించడం నా వల్ల కాదు. ఇంట్లో కూర్చుని చదువుకోవడమో, రాయడమో చేయగలను కానీ శరీర వ్యాయామం చేసే ఓపిక నాకు లేదు. చిన్నప్పట్నించీ లేని అలవాటు హఠాత్తుగా ముప్పై అయిదేళ్ళు దాటేక చేసుకోవడం నా వల్ల కాదు. నా వల్ల అయ్యేదల్లా నడక ఒక్కటి మాత్రం. ఇది నాకు తప్పనిసరి కూడా! ఎందుకంటే రెండు చక్రాల బళ్ళేవీ నేను ఎక్కి తొక్కలేను. నాలుగు చక్రాలబళ్ళు మెయింటెయిన్ చేసే స్తోమత లేదు.

గవర్నమెంటు ఉద్యోగం చేసేవాళ్ళకు వళ్ళు బరువుంటుందట. అందుకని ఏదైనా ప్రయివేటు కంపెనీలో చేరమని కొందరు దగ్గరి బంధువులు మేలమాడారు. కదలలేని స్థితి వస్తే చక్రాల మంచం మీదైనా ఆఫీసుకి వెడతాను గానీ చూస్తూ చూస్తూ గవర్నమెంటు ఉద్యోగం వదులుకోలేను.

నేను పనిచేసే ఆఫీసుచుట్టూ క్వార్టర్సున్నాయి. అందులో నాకూ స్థానం దొరికింది. ఆపీసుకి నడక అయిదు నిమిషాలులోపే! ఉదయం తొమ్మిదింటికి ఆఫీసుకి చేరుకోవాలి. నేను టిఫిన్ తిని ఆఫీసుకు బయల్దేరేవేళకు వళ్ళు బరువెక్కుతుంది. అప్పుడా అయిదునిముషాల నడకా బాగానే వుంటుంది. అయితే యిక్కడో యిబ్బంది వుంది.

ఆఫీసులో అందరికీ ఇంచుమించు స్కూటర్లున్నాయి. వారంతా కూడా

స్కూటర్లమీదే ఆఫీసుకు వస్తూంటారు. నడిచి ఆఫీసుకు వెళ్లేవారందరికీ క్వార్టరు వదిలి నాలుగడుగులు వేసేసరికి లిఫ్ట్ దొరుకుతూంటుంది. లిఫ్ట్ కావాలని ఎవరూ అడగక్కరలేదు. నడిచే మనిషి కనబడగానే వాళ్ళే స్కూటర్ ఆపి – హారన్ కొట్టి "కమాన్ యార్" అంటారు.

ఈ లిఫ్ట్ ఉపయోగించుకోకూడదని నేను అనుకున్నాను. అయితే ఈ నిర్ణయం తీసుకున్న మొదటి రోజునే ఎనమండుగురు స్కూటర్‌వాళ్ళను ఇబ్బంది పెట్టవలసి వచ్చింది. వాళ్ళు నా గురించి స్కూటరు ఆపడం – నేను దారిలో ఏదో పని వుందని చెప్పడం (వళ్ళు బరువని చెప్పుకోడానికి సిగ్గుకదా!) – ఒక స్కూటర్ నన్ను దాటి వెళ్ళిన కొద్ది క్షణాలకే మరో స్కూటరు ఆగడం – ఇది నా మనసుకంతగా నచ్చుబాటు కాలేదు.

అడిగి లిఫ్ట్ ఇస్తూంటే కాదంటే అవతలి వాళ్ళు చాలా ఫీలవుతారు. ఒక రోజైతే ఏదో వంక పెట్టవచ్చు. రోజూ అలా చేస్తే బాగుండదు కదా! అప్పటికీ మర్నాడు తెగించి "నాకు వళ్ళు బరువు – నన్ను నడిచే వెళ్ళనివ్వండి" అన్నాను జోకుగా అన్నట్లు – మొదట స్కూటరాపినతన్ని చూసి.

అతనదోలా ముఖం పెట్టి "నామీదేం జోకు లేయక్కర్లేదు. స్కూటరెక్కండి" అన్నాడు.

అప్పుడే నాకు స్ఫురించింది అతను నాకంటే లావు అని. అతనే కాదు. స్కూటర్ మీద వెళ్ళే చాలామంది నాకంటే పుష్టిగా వున్నారు. అందుకు వాళ్ళ స్కూటర్లే కారణమయుండొచ్చు.

మారు మాట్లాడకుండా స్కూటరెక్కేశాను.

ఈ స్కూటర్ల మొహమాటాన్నెలా తప్పించుకోవాలా అని తీవ్రంగా ఆలోచించగా ఒక విషయం స్ఫురించింది. మా ఆఫీసు తొమ్మిదింటికి. అయితే గవర్నమెంటాఫీసు కావడంవల్ల ఎవ్వరూ తొమ్మిదింటికి రారు. తొమ్మిదింపావు ప్రాంతాల మా రోడ్డు చాలా రద్దీగా ఉంటుంది. కాబట్టి నేను మరికాస్త ఆలస్యంగా బయల్దేరితే సరిపోతుంది. ఇలా అనుకుని ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళడం ప్రారంభించాను.

ఈ విధంగా తొమ్మిదింపావు నించి పది మధ్యలో అన్ని సమయాల్లోనూ ప్రయత్నించాను. కానీ ఈ సమయంలో కూడా ఏవో స్కూటర్లు వస్తున్నాయి. ఆ మాటకొస్తే పది తర్వాత కూడా కొన్ని స్కూటర్లొస్తున్నాయి. ఇందులో ఆశ్చర్యమేమీ లేదు. ఆఫీసుకు ఎంత ఆలస్యంగా వచ్చినా అడిగేవాళ్ళు లేరు.

అయినా ఈ విషయంలో వాళ్ళను తప్పుపట్టే అర్హత నాకూ లేదు. అవును మరి, ఓ కారణంవల్ల నేను ఆలస్యం చేస్తూంటే మరో కారణం వల్ల వాళ్ళు ఆలస్యం చేస్తూండవచ్చు. నన్నూ అడిగే వాళ్ళు లేరు. వాళ్ళనూ అడిగేవాళ్ళు లేరు.

అప్పుడు నాకు అసలు పరిష్కారం స్ఫురించింది. నిజంగా మనస్ఫూర్తిగా నేను స్కూటర్ల మొహమాటాన్నుంచి తప్పించుకోవాలంటే అందుకు ఒకే ఒక్క ఉపాయముంది. అదే ఆఫీసుకి టైముకి వెళ్ళడం. అలా వెళ్ళాలంటే ఇంటి దగ్గర అయిదు నిముషాలు

తక్కువ తొమ్మిదికల్లా బయల్దేరాలి.

ఆ ప్రకారం ఒకరోజు వెళ్ళాను. ఒక్క స్కూటర్ కూడా రాలేదు. అంతేకాదు, దారి నిర్మానుష్యంగా వుంది. ఎంత నిర్మానుష్యంగా వుందంటే - ఎవరైనా నన్నా సమయంలో హత్యచేసి ఎవరికంటా పడకుండా పారిపోవచ్చు. ఆ ఆలోచన కలిగి ఒక్క పిసరు భయంకూడా వేసింది.

ఏమైతేనేం నా సమస్యకు పరిష్కారం దొరికింది. రోజూ యిలా చేస్తే ఏ బాధా వుండదనిపించింది.

మర్నాడు కూడా అలాగే వెళ్ళాలనుకున్నాను గానీ తెమల్లేకపోయాను. మరి లిఫ్టు తప్పలేదు.

ఆ మర్నాడూ అలాగే జరిగింది.

అంతేకాదు - ఆ తర్వాత నుంచి ప్రతి రోజూ అలాగే అవుతోంది.

సాధారణంగా నేను ఆఫీసుకు తొమ్మిదీ అయిదు నిముషాలకు బయల్దేరతాను. ఇంకొక్క పదినిముషాలు ముందుగా ఎందుకు తెమల్లేకపోతున్నాను? .... పట్టుదల వచ్చి కాస్త ముందుగా నిద్రలేవడం మొదలెట్టాను. ఎంత పెందరాళే లేచినా తెమిలేసరికి తొమ్మిదీ అయిదు అయిపోతోంది.

నన్ను నేనే విమర్శించుకుని గ్రహించినదేమిటంటే - ఆఫీసుకు టైముకి వెళ్ళడం నాకు కష్టమేమీ కాదు. కానీ అందుకు నాకు మనసొప్పడం లేదు. అదీకాక పదేళ్ళుగా అయిన అలవాటిది నాకు. ఏ ఏమర్జెన్సీలూ లేకుండా ఈ అలవాటెలా పోతుంది?

అయినా నాకంటే వళ్ళు బరువు మనుషులు స్కూటర్లమీద పోతున్నప్పుడు నేను మాత్రం వళ్ళు బరువు గురించి పట్టించుకోవడమెందుకూ - అని కూడా నాకు అనిపించింది.

ఆఫీసుకు నడిచే వెళ్ళితీరాలన్న పట్టుదల వదులుకున్నాను.

✦ ✦ ✦